# గొర్రెలకాపరి

పెద్ద వర్షం. ఆకాశం నిండా కప్పుకున్న మేఘాలు. మెరుపులతో ఉరుములతో మొదలయిన వర్షం ఇప్పుడు నిలిచి కురుస్తున్నది. పగలు పదకొండు గంటల సమయంలో సైతం మబ్బు మబ్బుగా, చలిచలిగా ఉన్నప్పటికీ, ఆ వర్షంలో తన తాటికమ్మగొడుగు కింద ఇసికనేలమీద కూర్చున్న నర్తోడు 'మా బంగారం లాంటి వాన... గంగమ్మ తల్లి కనికరించి కురిసేస్తన్నాది' అని ఆ వర్షాన్ని చూసి మురిసి పోతున్నాడు. ఆ వర్షానికి ఆ చుట్టూ ఉన్న మొక్కలూ, చెట్లూ, పిట్టలూ, పశువులూ సంతోషిస్తూ పులకించి పోతున్నట్టున్నాయి.

పశువుల మేత కోసం విడిచి పెట్టిన ఆ బంజరు అడవి — ముళ్ల తుప్పలతో, తాటిచెట్లతో, అక్కడక్కడ మర్రి, వేప, కానుగ, బూరుగు, రావిచెట్లతో నేలమీద పచ్చగా పరచుకున్న రకరకాల గడ్డిమొక్కలతో దాదాపు రెండువందల ఎకరాలు పచ్చగా నిండుగా ఉంది. వర్షాకాలంలో చుట్టుప్రక్కల గ్రామాల రైతులు, అక్కడ తమ పశువులను మేపుకుంటారు. నర్తోడు గొర్రెల కాపరి. గొర్రెల్ని అడవిలో విడిచిపెట్టి

వాటి సమీపంలో ఓ మర్రి చెట్టు కింద కూర్చుని వర్షాన్ని చూసి ఉప్పొంగి పోతున్నాడు.

ఆ వర్షానికి ఆవులు కొన్ని ఆ చెట్టు కిందా, ఇతర చెట్ల కిందా చేరాయి. గేదెలు మాత్రం వర్షంలోనే మేత మానేసి ఆనందంతో తడుస్తూ నుంచున్నాయి. గొర్రెలు, మేకలు కొన్ని చెట్ల కింద, కొన్ని వర్షంలో గుంపులు గుంపులుగా మేత మానేసి నుంచున్నాయి.

'ఈ వానలో శంకరయ్య నాయుడిని వల్లకాడులో ఎలా కాలుస్తారో...' అన్నాడు ఇంకా పద్నాలుగేళ్లు నిండని కృష్ణారావు. నెలదినాల కిందటి వరకు హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి విద్యార్థి. తండ్రి చదువు మాన్పించి కొడుకును పశువులకాపరి పనిలో పెట్టాడు.

కృష్ణారావు గుర్తుచేసేవరకు నర్తోడికి రాత్రి శంకరయ్యనాయుడు చనిపోయిన సంగతి గుర్తే లేకపోయింది. పదిదినాలుగా కుడికాలి బొటనవేలుమీది పుండుతో నర్తోడు బాధపడుతున్నాడు. గ్రామానికి దాదాపు కిలోమీటరు దూరంలో ఉన్న కొబ్బరితోటలో గొర్రెలమంద దగ్గర రాత్రంతా కాపలా ఉండి, తెల్లవారిన తర్వాత ఊళ్లోకి వచ్చి బుగతోరు (యజమాని) ఇంటికి నాలుగు కావుళ్ల మంచి నీళ్లు మోసి, ఇంత చల్లంది తిని, మళ్లీ తోటకి వచ్చి, గొర్రెల్ని మేతకి తోలుకొస్తాడు. ఇవేళ కాలి బొటనవేలు మీది పుండుకు మందు కోసం చాకలి రంగడు ఇంటికి వెళ్లాడు. రంగడు ఇంట్లో లేడు. రేవు దగ్గరున్నాడంటే దాదాపు చాలా దూరంలో ఉన్న చెరువుకు వెళ్లి, అక్కడ వేలుకు మందు కట్టించుకుని తోటకి వచ్చేసరికి ఆలస్యమైంది. గొర్రెలు ఒకటే అరుస్తున్నాయి. ఆ తొందర్లో శంకరయ్య నాయుడు చనిపోయిన సంగతి, పాడె ఇంటి నుండి వల్లకాడుకు తీసుకుని వెళ్లారో లేదో అన్న సంగతి మరచిపోయాడు. చాకలి రంగడి ఇంటికి ఉదయం వెళ్లినప్పుడు శంకరయ్య నాయుడు ఇంటి ముందు జనం కనబడ్డారు. ఏడుపులు వినిపించాయి. విశాఖపట్నంలో ఉన్న కొడుకు రావాలని చెప్పుకున్నారు. చుట్టుప్రక్కల గ్రామాల్లోనే ఉంటున్న కూతుళ్లూ, అల్లుళ్లూ వచ్చేసినారని, అదృష్టవంతుడు శంకరయ్య నాయుడు ఏ రోగం లేకుండా చనిపోయినాడని చెప్పుకున్నారు.

'ఈ పాటికి ఎప్పుడో బుగ్గయి పోయేవాడు. కొడుకు విశాఖపట్నంల సదువుకుంటున్నాడు కదా... ఆడు రావాల... రాత్రే ఒక మనిషి... ఆడిని తీసుకురాడానికెల్నాడు కదా. పీనుగ ఇంట్లోనే ఉన్నాది... నేను వచ్చేయాళకి...' అన్నాడు కృష్ణారావు.

ఆ మాటలు విన్నప్పుడు నర్తోడు చనిపోయిన తన తొమ్మిది పదేళ్ల కొడుకును గుర్తు తెచ్చుకున్నాడు. ఇలాంటి వానా కాలపు రోజులే. చిన్న పిల్లాణ్ణి కాల్చకూడదని కావేటిలో మొగలి డొంకల దగ్గర లోతు గొయ్యితవ్వి వాడి శవాన్ని పూడ్చారు. తవ్వుతుంటే వాన నీళ్లు ఊరుతున్నాయి గోతిలో. ఏం కాదులే అని శవాన్ని పాతిపెట్టేశారు. నక్కలు గోతిని తవ్వేసి శవాన్ని ఎత్తుకు పోతాయని శవం మీద ముళ్లతుప్పలు పెట్టి మట్టితో కప్పెట్టారు.

ఆ దృశ్యాలు కనిపించాయి కళ్లముందు నర్తోడికి.

ఆ కొంతసేపు వాడికి వర్షం కనిపించలేదు. ఎదురుగా మరొక తాటికమ్మ గొడుగు క్రింద కూర్చున్న కృష్ణారావు కనిపించలేదు. తన చుట్టూరా ఇసిక మీద పాయలు పాయలుగా పారుతున్న వాన నీరు సైతం కనిపించలేదు. ఆ జ్ఞాపకాలలో వాడు నిండా మునిగిపోయాడు. ఆ కొంతసేపు వాడికి బొటనవేలి నొప్పి సైతం తెలియలేదు.

గాలికి వర్షం తెరలు తెరలుగా, కెరటాలు కెరటాలుగా ఊగుతున్న దృశ్యం మనోహరంగా ఉంది కృష్ణారావుకి.

వాళ్లిద్దరూ కూర్చున్న చోటనే వారి ప్రక్కగానే మరో మూడు తాటికమ్మ గొడుగులు చిన్నగూడులా ఇసికలో కాములను గుచ్చి నిలబెట్టారు. ఆ మూడు గొడుగుల వాళ్లు కూడా పసులకాపర్లే.

పరధ్యానంలో మునిగిపోయిన నర్తోడికి ఏదో గుర్తొచ్చినట్టయి 'లంజ కొడుకులు దొరికిపోయినారా ఏటి?' అన్నాడు తనలో తాను గొణుగుకున్నట్టు. 'కన్ను మూసి కన్ను తెరిసినంతల అంతా అయిపోవాల. ఈ పాటికి రావాల. అప్పుడనగ ఎల్లి...' అని తన చుట్టూ కలయజూశాడు, వాళ్లు వచ్చే దారివేపు వెతుకుతూ నర్తోడు.

నర్తోడికి తాటికమ్మగొడుగు తన ఇల్లులాంటిది. దాన్ని ఎంతో అందంగా వన్నెల చిన్నెలుగా అలంకరించాడు. పాలపిట్ట రంగురంగుల ఈకలు పువ్వుల్లా గుత్తులుగుత్తులుగా పంజరానికి వేలాడగట్టాడు. చింత పురుగు రెక్కల్ని అదే పంజరానికి పువ్వులాగా కట్టి వేలాడేశాడు. గొడుగుకాము వెదురుకర్రకి మధ్యమధ్య తాళ్లతో ముడులు వేశాడు. వెదురు కాముకి రోజూ నూనె రాసి ఎర్ర రంగొచ్చేట్టు పండించాడు. అంత అందమైన గొడుగులు ఆ ఊళ్లో నాలుగయిదు కూడా ఉండవేమో. కృష్ణారావుకి ఆ గొడుగు చాలా ఇష్టం. చూట్టానికి ఆ గొడుగు ఒక బొమ్మలాగ ఉంటుంది. నర్తోడి దగ్గర ఒక్కొక్కసారి ఆ గొడుగు తీసికొని తన చేతులతో

దాన్ని పట్టుకుని మురిసిపోతాడు కృష్ణారావు. అది నర్రోడికి రెండో ప్రాణం. దాన్ని వదిలి గొర్రెల మందతో వాడు ఎప్పుడూ రాలేదు. ఎండకీ వానకీ నర్రోడికి అదే తోడు.

తుమ్మల సవరయ్య కొబ్బరి తోట ఇప్పుడు ఈ వర్షంలో కనిపించటం లేదుగాని దగ్గర్లోనే ఉంది. ఆ తోటలో ఒక అర ఎకరం నేలలో కర్ర పెండలం పెంచాడు. ఆ కర్రపెండలం దుంపలు తవ్వుకుని రావటానికి తుంబడు, గడ్డయ్యా, సోములు వెళ్లారు. వాళ్లు ఇంకా తిరిగి రాలేదు. దుంపలు తవ్వుతున్నప్పుడు రైతు వాళ్లను చూసి వాళ్లను పట్టుకున్నాడేమో. వాళ్ల దుంపల దొంగతనం బయటపడ్డాదేమో అని భయం పట్టుకుంది వాడికి.

'తుమ్మల సవరయ్యా చిన్న రైతు. దొంగతనం బయటపడినా వాడి కాలు పట్టుకుంటే చమించి వొదిలేస్తాడు. వాడు పెద్దల దగ్గరకి తగువు కెల్లడు.' అని నర్రోడి భరోసా. మరి పెద్దరైతులంటే అందరికీ భయమే. ఆ చుట్టూ పెద్దరైతుల కొబ్బరి తోటలు చాలాచాలా ఉన్నాయి. వాళ్ల తోటల్లోకి వెళ్లి పండో, కాయో, దుంపో ముట్టుకుంటే చాలు, చాల పెద్ద తగువైపోతుంది. పెద్ద రైతులు అంతా ఒక మాట మీద ఉంటారు. దొంగతనం తగువు చేసి 'తప్పు' (జుల్మానా) వేస్తారు. దొంగపోయింది పైసా అయితే దొంగలించింది రూపాయంటారు. అంతా ముక్కుపిండి — పశువుల్ని అమ్మించో, బండిని అమ్మించో, చిన్నరైతు అయితే వాడి భూమిని అమ్మించో తప్పు సొమ్ము వసూలుచేస్తారు. పెద్ద రైతుల తోటల్లో చెట్టుకింద రాలి పడిన కాయని ముట్టుకోవాలన్నా అందుకే భయం. పెద్దరైతుల తోటల్లో అందుకే అడుగుపెట్టరు. చిన్న రైతులంటే బతిమాలుకుంటే నాలుగు తిట్టి ఊరుకుంటారు. పెద్దలకు తగువు తీర్చమని అడిగితే ముప్పు తమకేనని వాళ్ల భయం. ఆ ఆలోచనతోనే తుమ్మల సవరయ్యా తోటలో దుంపలు తవ్వుకుని రమ్మని పురమాయించాడు నర్రోడు. ఆ వెళ్లిన వాళ్లు ఇంకా రాలేదు.

వెళ్లిన వాళ్లల్లో తుంబడు కత్తిలాంటివాడు. వాడికి పధ్నాలుగేళ్లుంటాయి. చూట్టానికి బలంగా పద్దెనిమిదేళ్ల వాడిలా ఉంటాడు. అయితే వాడికి పెద్ద రైతుల్ని చూసినా, పాముల్ని చూసినా, రాత్రిపూట వల్లకాడును చూసినా భయం. వాడికి తోడుగా వెళ్లిన గడ్డయ్యా, సోములు పదేళ్ల గుంటలు. వాళ్లకు తుంబడి లాంటి వొళ్లయితే లేదుగాని తెలివైన వాళ్లు, చురుకైన వాళ్లు. దేగకళ్ల లాంటి కళ్లతో వాళ్లు కాపలా ఉంటే ఎవరికంటా పడకుండా వచ్చేస్తారు. వర్షానికి ఇసిక మీది అడుగులు గుర్తుండవు. ఎవరు దొంగతనం చేశారో తెలీదు.

ఇంకా వాళ్లు తిరిగి రాలేదు. వానకి జడిసి ఎక్కడో ఏ పశువుల సాలలోనో ఆగిపోయినారేమో అనుకుంటే వాళ్లు ఇలాంటి వానకి లెక్కచేసే వాళ్లు కారు. ఇంతకి పది రెట్లు వానొచ్చినా వాళ్లు జడిసే రకం కాదు. వానకి తడిసేవి వాళ్ల ఒంటి మీద ఏమీలేవు. చిన్న గావంచా నడుం చుట్టూ కట్టుకున్నారంతే. తలకి చిన్నపాగా.

ఏ పెద్దరైతు ఎదురైనాడో ఏమో, ఎక్కడన్నా వాడికంట్లో పడకుండా దాక్కున్నారో ఏమో, లేదా ఏ పెద్ద రైతు కళ్లల్లోనో పడిపోయి, దొరికి పోయారో ఏమో, వాళ్లను పట్టుకుని కాళ్లూ చేతులూ కట్టేసి పడేసినారో ఏమో అని నర్తోడి భయం.

ఆ పసులకాపరి పిల్లలు అందరికీ ఆ వర్షంలో ఆకలాకలిగా ఉంటే దుంపలు తవ్వుకుని రమ్మని నర్తోడే వాళ్లని పంపించాడు. సై అంటే సై అని వాళ్లు బయల్దేరారు. అది వాళ్లకి దొంగతనం కాదు, ఆకలి.

'కుష్ణారావో తడిసి పోతన్నావా?' అడిగాడు నర్తోడు — 'గొడుగు అటుపక్క వొంచు. జల్లు ఆ పక్కనించి కొట్తన్నాది'

కృష్ణారావుకి ఈ పసుల కాపరితనం ఇంకా కొత్త. నెల దినాల కిందటి వరకు ఆ పిల్లవాడు హైస్కూలు స్టూడెంటు. పరీక్షల్లో ఫెయిలవుతున్నాడని, చదువంటే శ్రద్ధలేదని, చదువులకు పనికి రాడని తండ్రి నిరాశపడిపోయి, కొడుకును టౌన్ నుండి ఇంటికి తెచ్చేసి వ్యవసాయంలో పెట్టాడు. ఇదివరకు పసులు కాస్తున్న చిన్న కంబారి ఇప్పుడు దమ్ములు పని, పొలం పనులు, నాట్లు వేయటంలో ఉంటం వల్ల కృష్ణారావుని తోటలోని ఆవుల్ని మేతకి విడవమని చెప్పాడు తండ్రి. ఈ పసుల కాపరిపని పదిహేను రోజులుగా చేస్తున్నాడు కృష్ణారావు. వాళ్లకి ఆరు ఆవులున్నాయి. వాటిని ఉదయం పది గంటల సమయంలో ఈ బంజరుకి మేతకి తోలుకొస్తాడు. కృష్ణారావుకి వాటితో మచ్చిక ఏర్పడింది. అవి ఎంతో ప్రేమగా చూస్తాయి. వాటికి ఇది వరకే పేర్లున్నాయి. ఆ పేర్లు పెట్టి పిలిస్తే అవి తనని చూస్తాయి. వాటిని ముద్దు చేయటం కృష్ణారావుకి అలవాటయింది. అవి ఎంతో అందంగా ఉంటాయి. శ్రీ కృష్ణుడికి ఆవులంటే ప్రేమ. శ్రీకృష్ణుని కథలు కృష్ణారావుకి చాలా ఇష్టం. ఇప్పుడు గోపాలుడయినందుకు కూడా కృష్ణారావు సంతోషంగా ఉన్నాడు. తన ఆవుల మందే కాదు, ఇతర ఊళ్లల్లోని రైతుల ఆవులు దాదాపు ఓ రెండు మూడు వందలు ఉంటాయి. గేదెలుంటాయి. గొర్రెలమందలు, మేకల మందలు ఉంటాయి. వాటిని చూడటమే ఎంతో ఆనందంగా ఉంటుంది. దానికి తోడు దాదాపు తన వయసే ఉన్న ఆ పసులకాపర్లతో స్నేహం ఏర్పడింది. కొందరికి కృష్ణారావు అక్షరాలు నేర్పిస్తున్నాడు. వాళ్లు కృష్ణారావుకు

పల్లెపాటలు నేర్పుతున్నారు. దాంతో చదువంటే, స్కూలంటే, టీచర్లంటే, తోటి విద్యార్థులంటే ఉన్న భయం వాడి జీవితం నుండి తొలగిపోయి ఇప్పుడు నిశ్చింతగా ఉన్నాడు. రాత్రిపూట పుస్తకాలు చదువుకోవటం, హోమ్‌వర్క్ చేయటం తప్పిపోయినందుకు కూడా సంతోషంగా ఉంది కృష్ణారావుకి.

నర్శోడు అంటే కృష్ణారావుకి ఇష్టం. నర్శోడిలాగా బుద్ధిమాటలు ప్రేమతో చెప్పే మనుషులు తక్కువ. అమ్మలాగ, నాన్నలాగ చెప్తాడు. ఏభయ్యేళ్ల పెద్ద వయసువాడే అయినా స్నేహితుడిలా ఉంటాడు. తనతో ఆడుకుంటాడు. అంత ప్రేమతో ఏ మేష్టారూ మాటాడలేదు. ఆ టీచర్లు ఎవరి మీదనో కోపంతో ఉన్నట్టు బడికి వచ్చి, జిడ్డు మొఖాలతో పాఠాలు చెప్పి వెళ్లేవాళ్లు. ఒకరిద్దరు మంచి టీచర్లున్నా వాళ్ల ప్రేమ కన్నా ఈ జిడ్డు మొఖాల టీచర్లు కొట్టే దెబ్బలు, తిట్టే తిట్లూ భయపెట్టేవి. క్రూర జంతువుల్ని చూసినా అంత భయం కలగదు. ఇప్పుడు తండ్రి చదువు మాన్పించేసినందుకు కృష్ణారావుకు హాయిగా ఉంది. తుంబడు, గోనెప్రాముడు, గడ్డయ్య, సోములు వీళ్లంతా మంచివాళ్లు. వందలు వందలున్న హైస్కూలులో ఎక్కడా ఇంత మంచిస్నేహితులు దొరకలేదు కృష్ణారావుకి. ఆవుల్ని తోలు కొచ్చిన తొలిరోజునే ఇక్కడ ఈ బంజరు అడవిలో వీళ్లంతా నేస్తులయిపోయారు. అందుకే దుంపలు తవ్వి తేవటానికి తుంబడు, గడ్డయ్య, సోములతో తనూ వెళ్తానన్నాడు కృష్ణారావు. నర్శోడు ఒప్పుకోలేదు.

'నీవు రైతు కొడుకువు. దొరికిపోతే పరువు పోతాది. ఆళ్లా, నాలుగు తన్నినా తింటారు, బరిస్తారు, వొద్దు' అని కృష్ణారావును పోనివ్వలేదు.

మొన్న ఇలాంటిదే పెద్దవాన పడింది. నిన్న ఇదేవేళకి మళ్లీ కురిసింది. ఇసక భూములు తడిసి మెత్తబడ్డాయి. దుంపచెట్టు పట్టుకుని సులువుగా ఒడుపు మీద పైకిలాగితే దుంపలన్నీ గుత్తుగా వచ్చేస్తాయి. చెట్టుతో పట్టుకొచ్చేస్తే దొంగతనం అంత తొరగా బయటపడదు. ఆ చెట్టు కొమ్మల్ని గొర్రెల దగ్గర పడేస్తే అవి తినేస్తాయి. రెండు చెట్లు పట్టుకొస్తే అక్కడున్న అందరికే కాదు, మరో ఇద్దరు ముగ్గురికి ఇవ్వొచ్చు.

ఈ పసులకాపర్లు ఉదయం ఎనిమిది తొమ్మిది గంటల వేళ ఇంటికాడ పకాళి(చద్దన్నం) తింటారు. మధ్యాహ్నం తిళ్లు వాళ్లల్లో ఎవరో ఒకరు ఊళ్లోకి వెళ్లి తెచ్చుకుంటారు. ఇవేళ గోనెప్రాముడు తిళ్లు తేవటానికి వెళ్లాడు. ఈ బంజరు అడవికి ఊరు పెద్ద దూరం కూడా ఉండదు. అయితే గోనెప్రాముడు నజ్జు. ఏ పనీ చెకచెకా చెయ్యడు. వాడు ఇంకా ఊళ్లోనే ఎవరింటికాడో ఉంటాడు. ఆ బుగతోరు తిండి తపేళాల్లో సర్ది, ఉట్టిలో పెట్టి ఇవ్వాలి. అయిదు ఇళ్లనించి ఆ రకంగా ఆ తిళ్లు తెచ్చి

భుజానికి రెండు దిక్కులా కావిడిలాగా వేలాడ గట్టి మోసుకురావాలి. వాడు తిని ఈ తిళ్లు మోసుకొస్తాడు. ఈ వాన విడిచిందాకా వాడు ఊరు విడిచిరాడు. వానలో తిళ్లు తడిసిపోయి, ఆ గిన్నెల్లోకి వాన నీళ్లు పోతాయి. ఈ వాన చూస్తే ఇప్పుడప్పుడే విడిచేట్టు కనిపించట్లేదు. వాళ్లకి ఆకలిగా ఉంది.

ఉదయం మందు వేలుకు పెట్టూ చాకలిరంగడు 'కాలికి రెండ్రోజులు నీళ్లు తగల్నివ్వకురో' అన్నాడు. కాని ఎక్కడ కుదుర్తుంది. అయినా కట్టిన మందుమీద ఉమ్మెత్తాకు కట్టుకున్నాడు. వానజల్లును ఎంత ఆపుతున్నా జల్లు కాళ్లని తడుపుతూనే ఉంది.

ఈ వాన ఎప్పుడు వదుల్తుందా అని చెట్టుకింద నుంచున్న పశువులు అమాయకంగా చూస్తున్నాయి. పశువుల మేతకోసం ఇంగ్లీసోళ్లు పాలించిన రోజుల్లో గ్రేజింగ్ గ్రౌండ్ అని విడిచిపెట్టిన ఈ బంజరు అడవి తప్పించి పశువులు ఈ వానాకాలం అడుగుపెట్టటానికి ఇంకెక్కడా చోటు మిగల్లేదు. అన్నీ కొబ్బరి తోటలు, పంట పొలాలు. చుట్టుప్రక్కల గ్రామాల పశువులన్నీ ఈ వర్షాకాలం ఇక్కడే మేయటం వల్ల గడ్డి ఇక్కడా లేదు. ముళ్ల తుప్పలున్నాయి. అవి కొరుక్కుంటాయి. కట్టు మీద తోటల్లోని సాలల్లో ఉంటే పశువులకాళ్లకు నొప్పులొస్తాయని మేతకి తోలుకొస్తారు. సాగిన పెద్ద రైతులు కొందరు సాలల్లో కట్టి ఉంచటం కూడా మామూలే. పశువులు విడిచే సమయానికి ఎండలాగానే ఉంది. ఇప్పుడు ఈ వాన.

పొగాకు ముక్క తీసి ఒక చిక్కుతెంచి నోట్లో వేసుకున్నాడు నర్తోడు. వాడికి పొగాకు నోట్లో పెట్టుకోవటం అలవాటు. దుంపలొస్తాయి తినొచ్చు అని ఇంత సేపు నోట్లో పొగాకు వేసుకోలేదు. వీళ్లు ఇంక ఎంత సేపటికి వస్తారో అని విసిగిపోయాడు.

వాన ఎడతెరిపి లేకుండా కుండపోతగా కురుస్తున్నది. ఆ వెళ్లిన వాళ్లు దగ్గరకు వస్తేనేగాని కంటికి కనిపించరు. వాళ్లు తెచ్చే దుంపల కోసం ఆశపడి ఎదురుచూస్తూ కూర్చున్నాడు. కడుపు ఆకలితో నకనకలాడిపోతున్నది. అనుకున్నదేమిటంటే ఈ వాన తగ్గిపోతాది, వాళ్లు ఆ దుంపలు తెస్తే వాటిని కాల్చుకుని తినాలని. అక్కడ ఆ చెట్టు కింద చాటున ఎండుపుల్లలు పోగేసి ఉంచారు. అవి ఇప్పుడు ఈ వానకి సగం తడిచి పోయాయి. ఇప్పుడు దుంపల్ని కాల్చుకోవటం పడదు. పచ్చివే తినాలి. పచ్చిదుంపలు కూడా రుచిగానే ఉంటాయి.

'వొస్తన్నారు' అన్నాడు కృష్ణారావు, తుప్ప చాటున నీడల్లాగా కదిల్తే చూసి.

తుమ్మమొద్దులాగ పొట్టిగా ఉంటాడు తుంబడు. సోములు, గద్దయ్యా ఒక

వయసు వాళ్లే అయినా బాన కడుపుతో, గుంటలుపడ్డ కళ్లతో ఏదో జబ్బు ఉన్నట్టు ఉంటాడు గద్దయ్య. అయితే చురుకుతనం తగ్గలేదు. వాడికి ఏవేవో ఆకుమందులూ, చెట్లవేళ్ల మందులూ తినమని చెపుతుంటాడు నర్తోడు. చాకలి రంగడు చెప్పిన మందులేనట అవి. అయితే అవి తిన్నప్పుడు ఉప్పులేని సప్పటి పత్యం ఏదో ఉండాలట...

ముగ్గురూ పొడవాటివి, దాదాపు రెండడుగులు పొడవున్న దుంపలు ఏడెనిమిది పట్టుకొచ్చారు. వాటిని వాళ్లు నర్తోడు దగ్గరపడేశారు. వెళ్లి వాళ్ల వాళ్ల గొడుగుల కింద వొళ్లు ముడుచుకుని కూర్చున్నారు. తలపాగాలు, మొలకి కట్టుకున్న గావంచాలు పిండుకున్నారు.

నర్తోడు ఎర్రటి మనిషి. ఎండల్లో ఎండి, వానల్లో తడిసి వాడి ఒంటికి బెల్లం రంగొచ్చింది. చిన్న గెద్దకళ్లు. సన్నటి పెదాలు. సగం నెరిసిన జుత్తు. మాసిన గెడ్డం. మీసాలు పై పెదాలను కప్పేసినాయి. వాళ్లు తెచ్చిన దుంపల్ని చేతుల్లోకి తీసికొని వాటిని ఒక్కొక్కదాన్ని రెండేసి ముక్కలుగా విరిచి వాళ్లకి ఒక్కక్కరికీ ఒక్కో ముక్క ఇచ్చాడు. 'కుష్టారావో తిను' అని ఒక ముక్కని కృష్ణారావు చేతిలో పెట్టాడు.

వాళ్లు వానలో తడిసినందుకేనేమో చలికి వణికి పోతున్నారు. అది చూసి తన తలపాగా తీసి తుంబడికిచ్చి 'ఏమింత ఆలీసం?' అని అడిగి 'వొల్లు తుడుసుకోండి' అన్నాడు. పొడి తువ్వాలుతో ఒళ్లు తుడుచుకుంటే ఒంటి మీది నీళ్లు ఆరిపోయి చలి తగ్గిపోతుందని వాడి ఆలోచన.

చలి బాధకన్నా వాళ్లకి ఆకలి బాధ భరించ లేనిదిగా ఉంది. నర్తోడు ఇచ్చిన తువ్వాలుతో ఒళ్లు ఒకసారి గబగబా తుడిచేసుకుని దుంపలు తినటానికి తొక్క వొలుచుకుంటున్నారు.

నర్తోడు నోట్లోని పొగాకు ఉమ్మేసి, తర్వాత నోరు ఖాండ్రించి మరోసారి ఉమ్మేసి చేతిలోని దుంప తినటానికి తొక్క వొలుస్తున్నాడు.

'ఆడు సూసినట్టున్నాడ్రో' అన్నాడు సోములు.

ముక్క కొరికి తింటున్న వాడల్లా సోములు మాట విని నోరు తెరచుకుని చూశాడు సోములు వేపు నర్తోడు.

తుంబడు తినటం మొదలు పెట్టి సగం దుంప పూర్తి చేసినాడు. వాడికి ఈ మధ్యనే మగగొంతు వచ్చింది. వాడికి గుండెమీది రొమ్ముమొనలు గడ్డలు కట్టి నొప్పెట్టున్నాయి. వాడు ఎల్లప్పుడూ ఒక చేత్తో ఆ నెప్పికి వొత్తుకుంటాడు. ఇప్పుడు ఈ

వానలో అయితే తిండిలో పడ్డాడు కాని ఖాళీగా ఉన్నప్పుడల్లా వాడికి అదే పని. అది చూసి నర్తోడు 'నీకు సమర్తాడే వొయిసొచ్చిందిరా తుంబా' అని నవ్వి, నవ్విస్తాడు అందర్నీ.

'ఎవడ్రా, తమ్ముల సవరయ్యా?' అని అడిగాడు నర్తోడు. సోములు చెప్పిన మాటతో అనుమానం వచ్చింది. ఇదేదో కొంపమునిగినట్టే ఉందే అనుకున్నాడు నర్తోడు.

'ఆడు కాడ్రా. తామాడ సుగ్రీవుబావు. వస్తుంతే ఆ పక్క గుడ్డి(తోట)లోని సాల్లోన ఆడు కనబడ్డాడు. ఆడు సూసినట్టున్నాడు' ఓ పక్క పచ్చిదుంప నములుకుంటూనే చెప్పాడు సోములు.

దుంపతినటం మానేసి నర్తోడు తుంబడినీ, గడ్డయ్యనీ నిజమేనా అన్నట్టు వాళ్ల ముఖాల్లోకి చూశాడు.

'ఆడు ఈ యేళప్పుడు యానికుంతాడ్రా, నీ అనుమానంగాని' అన్నాడు గడ్డయ్య. అక్కడే చూసినట్టు సోములు గొణిగాడు. గడ్డయ్య వెతికి చూశాడు. దగ్గర్లో ఎవరూ కనిపించలేదు. ఏ చెట్టో ఏ తుప్పో చాటు. దాంతో ఎవరూ కనిపించలేదు.

తామాడ సుగ్రీవు అంటే కృష్ణారావుకి కోపం. వాడు వయసులో కృష్ణారావు కన్నా పది పన్నెండేళ్లు పెద్ద. చిన్నప్పుడు చెర్లో స్నానం చేస్తున్నప్పుడు వాడు ఒకసారి కృష్ణారావుని పట్టుకొని నీళ్లల్లో బలంగా ముంచేసాడు. వొదిలిపెట్టలేదు. నీళ్లలో ఊపిరి పీల్చుకోలేక ఉక్కిరిబిక్కిరై పోయాడు కృష్ణారావు. కేకలేసి అరచి తిట్టాడు సుగ్రీవుని. వాడు మళ్లీ పట్టుకుని నీళ్లల్లో ముంచి అణచిపెట్టాడు. వాడిని ఊళ్లో అంతా తిట్టేవాళ్లు. అయినా వాడేం మారలేదు. వాడి తండ్రికి విధవ అప్పజెల్లెళ్ల ఆస్తి పదెకరాల భూమి, ముప్పయినలభయి తులాలబంగారం, పాతికముప్పయివేల రూపాయల నగదు రెండు ఇళ్లు కలిశాయి. ఒక్కడే కొడుకు. వాడికి వాళ్లు, ముఖ్యంగా ఆ ఊళ్లో ఆడవాళ్లు రాచ్చసుడు అని పేరు పెట్టారు.

'ఆడి గుడ్డిలో అడుగుపెట్నామేంటి? ఆడు సూస్తే బయమేంటి?' అని తీసిపారేశాడు గడ్డయ్య.

'ఆడికి మనం దొరికితే సరిరా. ఎక్కడ నుండి తెచ్చినామో వొద్దు. ఒకటి దొంగలాడితే వాడు పది దొంగలాడినాడంతాడు. పక్క గుడ్డిలో తెస్తే తన గుడ్డిలోనే తెచ్చినామంతాడు.' గడ్డయ్య మాట విని నర్తోడు వాడి గుణం గురించి చెప్పాడు.

వాళ్లు ఆ తెచ్చిన మొత్తం దుంపలు తినేసేసరికి వర్షం తెరిపిచ్చింది. మేఘాలు

తెల్లబడ్డాయి. పశువులు ఒళ్లు దులుపుకుని చెట్లకిందినుంచి మేతకి బైటకి సాగాయి. గొర్రెలు కూడా కదిలి తుప్పల మీద పడ్డాయి.

'తామాడ సుగ్రీవు వొస్తున్నాడు' అన్నాడు సోములు.

అందరూ సోములు చూస్తున్న దిక్కుగా చూశారు. వాళ్లకి వాడు తమవేపే వస్తూ కనబడ్డాడు.

'వోరీ వోరీ ఆ తొక్కలు తీసి దూరంగా తుప్పల్లోకి కనబడకుండ పారేయండ్రా' అన్నాడు నర్తోడు.

గబగబా ఎవరికి అందింది వాళ్లు అక్కడ ఏ ఆచూకీ కనిపించకుండా తీసేసి దూరంగా తుప్పల్లోకి పారేశారు.

కృష్ణారావు చేతిలో చిన్నముక్క ఇంకా మిగిలి పోయింది. దానిని రాయిని విసిరినంత దూరం విసిరేశాడు కృష్ణారావు. .

తమవేపు వస్తున్న తామాడ సుగ్రీవును చూడనట్టు తన గొడుగు పట్టుకుని నర్తోడు గొర్రెలు వేపు నడచిపోయాడు. సోములు వాడి అవులు వెళ్లిన వేపు దారితీశాడు.

గడ్డయ్య, తుంబడు, కృష్ణారావు ఎక్కడికి వెళ్లాలో తెలియక వాళ్లున్న చోటనే వర్షం వెలిసింది కాబట్టి గొడుగులు కిందినించి బైటికి వచ్చి నుంచున్నారు. తుంబడు ఏమీ ఎరగనట్టు అమాయికంగా ముఖం పెట్టాడు. గడ్డయ్య నిబ్బరంగా ఉన్నాడు. కృష్ణారావుకు ఏదీ చేత కావటం లేదు. భయంగా ఉంది వాడికి.

వస్తూనే 'ఏమిరో, దుంపలు బాగున్నాయా?' అని అడిగాడు నవ్వు ముఖం పెట్టి తామాడ సుగ్రీవు.

గుండె ఆగినంత పనయింది వాళ్లకి. తామాడ సుగ్రీవు మాటలు వినిపించాయి నర్తోడికి.

'బావున్నాయి బావు' అన్నాడు తుంబడు. వాడు ధైర్యం తెచ్చుకున్నాడు. వాడి గుడ్డిలోనివి కాదు కదా. 'ఆకలయితే తెచ్చుకున్నాం బావు' అని చెప్పాలని మనసులో అనుకున్నాడు తుంబడు.

'ఏమిరో నర్తోడా, బావున్నావా?' ఎంతో నెమ్మదిగా పలకరించాడు తామాడ సుగ్రీవు, అంత దూరంలో కనిపించిన నర్తోడిని చూసి.

'బావున్నాను బావు' అన్నాడు నర్తోడు.

'ఏమిరో ఈళ్లసేత ఈ పని సేయించినావు?' అని మంచి మంచిగానే నెమ్మది

మాటల్తోనే మరోసారి అడిగాడు.

కాని వాడి మాటల్లో విషం వాళ్లకి తెలుస్తూనే ఉంది. వాళ్లల్లో భయమూ ఉంది. తెగింపూ ఉంది. ఏం చేస్తాడో చూద్దాం అన్న ధైర్యమూ ఉంది.

'ఏం పని బావు?'

'నీ దొంగబుద్ధి పోలేదుర దొంగలంజకొడకా' అన్నాడు తామాడ సుగ్రీవు. ఈ సారి కూడా మాటలు మెత్తమెత్తగానే ఉన్నాయి. అరవలేదు. కోప్పడలేదు. కాని ఆ మాటలు పాము బుస కొట్టకుండా పడగ విప్పినట్టున్నాయి. వాడి చూపులు అట్లాగే ఉన్నాయి.

నర్తోడు నిజం చెప్పేస్తే బావుండుననిపించింది కృష్ణారావుకి. 'ఏం పని బావు' అని తెలియనట్టు నర్తోడు అడగటం కృష్ణారావుకి నచ్చలేదు.

తామాడ సుగ్రీవు అటు నర్తోడు వేపు నడుస్తున్నాడు.

నర్తోడు అంటే తామాడ సుగ్రీవుకు పడదని, కోపమని కృష్ణారావుకు తెలీదు. నర్తోడు తన తొమ్మిదేళ్ల కొడుకుని తామాడ సుగ్రీవు కాడ కంబారితనం ఉంచాడు. ఆ ఇంట్లో కంబారి తనం చేస్తున్నప్పుడే ఆ పిల్లవాడు జబ్బు పడ్డాడు. జబ్బుపడి పూర్తిగా నయం కాకముందే మళ్లీ పనిలోకి పంపించాడు. అక్కడ కొన్నాళ్లకి ఆ ఇంట్లోని పనులకీ, వాళ్లు పెట్టిన తిండికీ రోగం మళ్లీ తిరగబెట్టింది. ఎన్ని మందులిచ్చినా రోగం తగ్గలేదు. అంతా నాటు వైద్యమే. కొడుకు చచ్చిపోయాడు. కొడుకు పీనిగని ఒళ్లోపెట్టుకుని నర్తోడు దుఃఖాన్ని దిగమింగుకోలేక రాచ్చసుడి ఇంట్లోన పెట్టేసినాను కొడుకో, ఆ రాచ్చసుడు తినేసినాడుకొడుకో ఆదుపొట్టలో పెట్టేసుకున్నాడు కొడుకో అని ఏడ్చాడు. ఊళ్లో జనమంతా ఆ రాచ్చసుడే నర్తోడి కొడుకుని తినేసినాడని చెప్పుకున్నారు. పాతఅప్పులు తీర్చడానికి కొడుకును కంబారి తనంలోపెట్టి, తామాడ సుగ్రీవు దగ్గర అప్పు తెచ్చాడు. ఈ జబ్బుకు మళ్లా అప్పు చేశాడు. పెళ్లాం చచ్చిపోయిన అప్పు ఇంకా తీరనేలేదు. ఆ అప్పు తీర్చడానికి అయిదేళ్ల నుండి గుర్రాల ప్రకాశం నాయుడు దగ్గర నర్తోడు కంబారితనం చేస్తున్నాడు. నర్తోడి తిట్ల గురించి విని తన అప్పు తీర్చమని తామాడ సుగ్రీవు పట్టుపట్టాడు. ఆ తగువు ఊళ్లో పెద్దమనుషుల దగ్గర పెట్టాడు. పెద్దమనుషుల తీర్పు కారణంగా మళ్లీ బుగత గుర్రాల ప్రకాశం నాయిడు దగ్గర అప్పుచేసి...

'అరే తుంబా, దుంపలు తెచ్చినావా లేదా నిజం సెప్పురా?' తుంబడి వేపు తిరిగి దూరం నించే అడిగాడు తామాడ సుగ్రీవు.

'తెచ్చినాను కాని మీ గుడ్డిలో కాదు బావు' అన్నాడు తుంబడు ధైర్యంగా.

'బొంకులు బొంకకురా. ఎక్కడ తెచ్చినావో చెప్పు?' అన్నాడు ఈసారి బెదిరించే గొంతుతో తామాడ సుగ్రీవు.

'తుమ్మల సవరయ్య బావు గుడ్డిలో తెచ్చినాను బావు.' అన్నాడు తుంబడు.

తుంబడు పూల రామయ్య నాయుడు కంబారి. పూల రామయ్య నాయుడు ఆ ఊళ్లో పెద్ద రైతు. డబ్బున్నవాడు. తన ఊళ్లోనే కాకుండా చుట్టుప్రక్కల ఊళ్లల్లో కూడా పేరున్నవాడు. ఆ ఊళ్లలో ఏ పెద్ద తగువొచ్చినా పూల రామయ్య నాయుడు దగ్గరకు రావాల్సిందే. దానికి తోడు వాడి కొడుకు పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్. వాడి తమ్ముడు బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీస్‌లో యూడీ క్లర్క్. వాడి అల్లుడు ఒకడు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్. అన్నిటికన్నా ముఖ్యం, పూల రామయ్య నాయుడు ఊరు సర్పంచికి దగ్గర మనిషి. వాడి మాటకి ఊళ్లో విలువుంది. అట్లాంటి పలుకుబడి గల పెద్దరైతు కంబారయిన తుంబడి మీద చెయ్యిచేసుకుంటే అది ముప్పే. వాడిని గట్టి మాట అనటానికి కూడా తామాడ సుగ్రీవుకి భయమే. ఆ ధైర్యంతోనే తుంబడు ఇలాంటి వాళ్లను లెక్క చెయ్యడు. బుగత ధైర్యం వాడికి కొండంత బలం.

మరి నర్తోడికి అలాంటి బలం లేదు. ఊళ్లో పెద్దలకీ గుర్రాల ప్రకాశం నాయుడికీ మధ్య ఎలక్షన్‌లలో గొడవలొచ్చాయి. ఊరు కట్టుకు లొంగక తన ఇంటి మీద తాను మద్దతు యిస్తున్న పార్టీ జెండా కట్టాడు. అంతేకాదు తన బందు బలగం వోట్లన్నీ ఆ పార్టీకే పొల్లు పోకుండా వెయ్యించాడు. ఆ పార్టీ ఎలక్షన్‌లో గెలవలేదు. అయినా ఒక మాట మీద నిలబడ్డ మనిషి అని అందరికీ గురే. అది ఇప్పుడు నర్తోడి మీద తామాడ సుగ్రీవుకు ఒక బలం.

తామాడ సుగ్రీవు చేతి కర్ర ఉన్న తన పిడికిలిని బిగించాడు. కళ్లురుముతూ మారు మాటాడకుండా వెళ్లి నర్తోడి మీద పడ్డాడు.

తనకి రెండో ప్రాణం లాంటి గొడుగు అడ్డం పెట్టుకున్నాడు నర్తోడు. ఆరేడు పెద్ద దెబ్బల నుండి ఆ గొడుగే నర్తోడిని, ఒంటి మీద దెబ్బ పడకుండా కాపాడింది. కానీ గుండె చిరిగి రక్తం కార్చుతున్నట్టు అనిపించింది నర్తోడికి. వాడి తోడూ నీడా ఆ గొడుగు... వాడి ఇల్లు లాంటిది ఆ గొడుగు...

'బాబ్బాబు కొట్టకు. తప్పయి పోయింది బాబు. నీకాలు మొక్కుతాను బాబో' అని నర్తోడు బతిమాలు కున్నాడు. కాళ్లు పట్టుకోబోయినాడు. అయినా తామాడ సుగ్రీవు మనసు కరగలేదు. వాడు సన్నగా పొడుగ్గా ఉన్నాడు. కోపంతో వాడి

ముక్కుచెరాలు విచ్చుకుని బుసలు కొట్టున్నాయి. వాడు కరవటానికి పై బడ్తున్న వేటకుక్కలా చూస్తున్నాడు. చేతిలోని కర్రని బలంగా విసిరి కొట్టున్నాడు. దెబ్బలు వొంటిమీద ఒక దగ్గరకాదు... వీపు మీద, భుజం మీద, కుడిచేతి ఎముక మీద, మోకాలి పిక్కల మీద...

ఐదారు దెబ్బలు తగిలిన తర్వాత గొడుగు తననింక కాపాడలేదని దాన్ని తుప్పల మీదికి విసిరేసి బూతులు తిట్టూ తిరగబడ్డాడు నర్తోడు. ముందు తామాడ సుగ్రీవు చేతిలోని కర్రని అందుకుని లాక్కున్నాడు. తన ఏభయ్యేళ్ల వయసులో ఎప్పుడూ ఎరగనంత కోపం వచ్చింది నర్తోడికి. ఒకటి రెండు దెబ్బలు కొట్టి కర్రని పారేసి, పిడికిలితో కడుపులో పిడిగుద్దులు గుద్దాడు. కసితీరా తన్నాడు. కింద పడిపోయిన తామాడ సుగ్రీవు ఆ దెబ్బలకి ఏడుస్తున్నా వదలక 'లంజకొడకా నా కొడుకును సంపినావు. నామీద పడ్డావు. ఇక్కడే గొయ్యి తవ్వి పాతేస్తాన్రా నా కొడకా. అయ్యా బాబూ అని బతిమాల్తే నీకు సెవుల ఇనబడ లేద్రా. కొమ్ములొచ్చినార్రయా నీకు. ఒరే తామాడ సుగ్రీవు... నేను సస్తే నాకోసం ఏడిసే వోళ్లు ఎవరూ లేరు. కాని నీవు సస్తే లంజకొడకా నీ పెళ్లాం తాడు తెంపుతార్రా. అంతా ఏడుస్తార్రా' అనిమరొక గుద్దు గుద్దాడు. వాడి జుత్తు పట్టుకుని కింద పడేశాడు.

* * *

'చూడు ఏం చేస్తానో' అని తామాడ సుగ్రీవు బెదిరించి అక్కడనుండి పారిపోయాడు. ఆ మాటలు విన్న తుంబడు, గడ్డయ్య, సోములు భయపడి పోయారు. వాడు ఊళ్లో పెద్దమనుషులకు ఈ దెబ్బలు చూపిస్తాడు. సర్పంచి తగువుకు పిలుస్తాడు. గుర్రాల ప్రకాశం నాయుడు అంటే ఊళ్లో పెద్దలకు ముందే పడదు. ఆ కసితో నర్తోడి మీద తప్పు తప్పక వేస్తారు. మామూలుగా అయితే ఇట్లాంటి తగువుల్లో పెద్దలు నాలుగు తిట్టి వొదిలేస్తారు. కాని ఇప్పుడు ఊరుకోరు. ఊరు కట్టు. కనుక రెండొందలు దాకా తప్పు వేయటం ఖాయం. నర్తోడు ఆ డబ్బు బుగత దగ్గరే తీసుకోవాలి. ఆ అప్పు తీర్చడానికి నర్తోడు మరొక సంవత్సరం కంబారితనం చెయ్యాలి. అయినా తప్పు చెల్లించినా ఊళ్లో పెద్దలు కాని, తామాడ సుగ్రీవుకాని ఊరుకోరు. ఎక్కడో ఏదో సాకు తీసుకుని మళ్లీ కొట్టిస్తారు నర్తోడిని. నర్తోడినే కాదు తగువుకి తమని కూడా సాచ్చెం కోసం పిలుస్తారు.

రాత్రికి తగువుకు పిలిచినప్పుడు ఏం చెప్పాలో అని భయపడుతున్నారు వాళ్లు. దుంపలు దొంగతనం చేసినందుకు వాళ్లకూ తప్పు పడుతుంది. అయితే వాళ్లకు ఏభై

అరవై రూపాయలకన్నా ఎక్కువ తప్పు పడకపోవచ్చు. ఆ తప్పు పైసలు చెల్లించటం కోసం మరొకసంవత్సరం వాళ్లు సైతం కంబారితనం చెయ్యాలి.

నర్తోడు ఇంకా కోపంతో మండిపోతున్నాడు. నర్తోడు ఎదురు తిరిగి తామాడ సుగ్రీవుని కొట్టున్నప్పుడు వాళ్లు చాలా సంతోషించారు. వాళ్లూ వెళ్లి తన్నాలనుకున్నారు. కాని ఇప్పుడు భయం. ఆ భయంలో సైతం వాళ్లకి మళ్లీ మొండి తెగింపే వచ్చింది.

'ఆడు మల్లా దీనిమీద ఏమయినా సేసినాడో — నన్ను పెద్దలంతా కలిసి నరికేస్తే నరికేయని. ఈ బూమ్మీద ఆడిని ఉంచను. ఆ లంజకొడుకు నా కొడుకుని తిండెట్టక, రోగమొస్తే కూకోనీయకుండా పనుల్లో పెట్టి నలగగొట్టి సంపేసినాడు. ఆడు రాచ్చసుడు.' అన్నాడు నర్తోడు. వెళ్లి తుప్పల మీద పడి ఉన్న తన గొడుగును తెచ్చుకుని, దాన్ని చూసి కళ్ల నీళ్లు పెట్టుకున్నాడు.

దూరం నించి గోనెెగ్రాముడు తిళ్లకావిడి మోసుకొస్తూ తుప్పల చాటునుండి కనబడ్డాడు. ఆకలి మరొకసారి నకనక లాడింది.

* * *

ఆ రాత్రి పెద్ద మనుషుల్నించి తగువు కబురు రాలేదు. ఆ తర్వాతా రాలేదు. పెద్ద మనుషులు దగ్గరకి ఆ తగువు పోలేదు.

నర్తోడు ఇప్పుడూ గొర్రెల కాపరే. అయినా ఆ ఊళ్లోని పసుల కాపర్లూ, కంబార్లూ చెప్పుకునే కథానాయకుడయ్యాడు.

'రోజులొక్క లాగ కలకాలం ఉండి పోవురా' అని చెప్తే — తుంబదు, సోములు, గడ్డయ్య, కృష్ణారావు దానికి సాక్ష్యం!

* * *

'సృజన' సాహితీ మాస పత్రిక

జనవరి 72